క్లుప్తంగా

సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతో, ఫలోదకాలతో, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం, విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

కంటి అద్దాల పంపిణీ



కంటి అద్దాలను అందజేస్తున్న వైద్య సిబ్బంది

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలోని రోగులకు బుధవారం ఉచితంగా కంటి అద్దాలు, పౌష్టికాహార కిట్లను అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నేత్ర పరీక్షలు చేసుకున్న వారిలో అవసరమైన 284 మందికి ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలను మంజూరు చేసింది. వీటిని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల వద్ద వైద్యులు ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే మండలంలో 14 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను కూడా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు బొజ్జిరెడ్డి, స్ఫూర్తి తేజ, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ పెద్ద మస్తానయ్య, ల్యాబ్ సూపర్‌వైజర్ సౌజన్య రాణి, ఆప్తమాలిక్ ఆఫీసర్ షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరుకు చేరుకున్న శ్రీరాముడి అక్షితలు



అక్షితలకు వేదమంత్రాలతో స్వాగతం పలుకున్న వేదపండితులు

ఆత్మకూరు: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి గుడి వద్ద బుధవారం అయోధ్యలోని శ్రీరామ మందిరం బాలరాముని సేవించిన అక్షితలు అయోధ్య నుంచి ఆత్మకూరుకు చేరుకున్నాయి. వేంకటేశ్వరస్వామి గుడి వద్ద అక్షితల కలశాలకు బ్రాహ్మణులు, వేదపండితులు వేద మంత్రాలతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో అనీల్‌శర్మ, బానాల లక్ష్మీనారాయణ, విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు సుదర్శన శర్మ, కమిటీ సభ్యులు దరగయ్య, ఆదినారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు వ్యాక్సిన్‌పై అవగాహన

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటి చెంచు గూడెంలో క్షయవ్యాధి గ్రస్తులకు బుధవారం బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్ 18 సంవత్సరాలుపై బడిన వారు, షుగర్ వ్యాధి గ్రస్తులు, టీబీ వ్యాధి చికిత్స పూర్తయిన వారికి, వారి కుటుంబ సభ్యులకు 60 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికీ వేయడం జరుగుతుందన్నారు. వ్యాక్సిన్ వేసేందుకు వైద్య సిబ్బంది సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దీపిక తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చిన్నారి

మహానంది: అనంతపురం జిల్లాకు చెందిన భక్తులు మణి, మంజు దంపతులు బుధవారం మహానందికి వచ్చారు. కాగా వారి కుమార్తె నవశ్రీ తప్పిపోయింది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు ఆలయ పరిసరాల్లో గాలించారు. అనంతరం విషయాన్ని ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బంది వెతికారు. పాప దొరకడంతో హోంగార్డు కోటయ్య, ఏజెన్సీ ఉద్యోగి శేఖర్‌రెడ్డి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఓంకారంలో నిరంతరాయ ఉచిత దర్శనం

మహానంది: కార్తీకమాసం సందర్భంగా బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారం ఆలయంలో భక్తులకు నిరంతరాయంగా ఉచిత దర్శనం కల్పిస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్తీకమాసం పురస్కరించుకుని శ్రీ గంగ, ఉమా సమేత శ్రీ ఓంకారసిద్ధేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు శీఘ్రదర్శనంతో పాటు ఉచిత దర్శనం అందుబాటులో ఉంటుందని చెప్పారు.

ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తపల్లి: శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణంలో సర్వం కోల్పోయిన నీటి ముంపు నిర్వాసితులైన నిరోద్యుగులు, లస్కర్ల సమస్యలను పరిష్కరించాలని నీటిముంపు నిరుద్యోగుల లష్కర్ల సంఘం నాయకులు చెన్నకేశవులు, ఇస్మాయిల్, రామ కృష్ణ, నూర్ అహమ్మద్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీశైలం రిజర్వాయర్ నిర్మాణంతో నీటిముంపునకు గురైన 44 గ్రామాల ప్రజలు నిరాశ్రయులు ఆయ్యారన్నారు. ప్రభుత్వం జీఓ 98 ప్రకారం శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు చేస్తున్న వారిని రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. 965 మందిలో కేవలం 200 మందికి మాత్రమే రెగ్యూలర్ ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. నెల రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బస్సుయాత్రకు ముమ్మర ఏర్పాట్లు

- రేపు ఆత్మకూరులో సామాజిక సాధికార బస్సుయాత్ర
- ఉదయం 11 గంటలకు వైఎస్సార్ స్మృతి వనం నుంచి యాత్ర ప్రారంభం
- పట్టణంలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు
- వివిధ సంఘాలతో ఎమ్మెల్యే శిల్పా విస్తృత సమావేశాలు
- నియోజకవర్గంలో లక్షకుపైగా లబ్ధిదారులకు రూ.వెయ్యి కోట్లకు పైగా ప్రయోజనం



ఆత్మకూరు పట్టణంలో బెలూన్ ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు పట్టణంలో ఈ నెల 24న నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఎథిక్స్ కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆయన తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు, వివిధ సంఘాల నాయకులతో విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తూ తలమునకలయ్యారు. అలాగే ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

యాత్ర సందర్భంగా కళాప్రదర్శనలు

సాధికార బస్సు యాత్ర సందర్భంగా ఆత్మకూరు పట్టణానికిశ్రీశైలం నియోజకవర్గంలోని శ్రీశైలం, ఆత్మకూరు, వెలుగోడు, మహానంది మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చే అభిమానుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ గిరిజనుల జానపద నృత్యాలు, కొమ్ము డోల్లు, వాయిద్యాల ప్రదర్శనలు ఉంటాయి. యాత్ర దృశ్యాలు వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిమగ్నమయ్యారు.

వైఎస్సార్ స్మృతివనం నుంచి యాత్ర ప్రారంభం

వైఎస్సార్ స్మృతివనంలో ఉదయం 11.30 గంటలకు తటస్థంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ , మైనార్టీ వ్యక్తులు, సీనియర్ పార్టీ నాయకులు , వైద్యులు, లాయర్లు , మత పెద్దలతో సమావేశం. భోజనాల అనంతరం యాత్రకు తరలివచ్చిన మంత్రులు, అభిమానులతో స్మృతివనంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి ఆత్మకూరు పట్టణానికి బస్సు యాత్ర బయల్దేరి నంద్యాల టర్నింగ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకోగానే, అక్కడ మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం భారీ జన సమూహం మధ్య ర్యాలీతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో బస్సుయాత్ర గౌడు సెంటర్‌కు చేరుకుంటుంది. అక్కడ బహిరంగ సభ ప్రారంభమవుతుంది.

శ్రీశైలం నియోజకవర్గంలో 1,07,585 మందికి లబ్ధి

శ్రీశైలం నియోజకవర్గంలో వివిధ పథకాల ద్వారా 1,07,585 మంది లబ్ధిదారులు డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.284,36,50,341 నగదు లబ్ధి పొందారు. బీసీలు 68,698 మందికి రూ.191,01,06,728, ఎస్సీలకు 27,305 మందికి రూ.64,13,38,019, ఎస్టీ లకు 6,669 మందికి రూ.17,47,35,194, మైనార్టీలు 4,913 మందికి రూ.11,74,70,400లు వారి ఖాతాల్లో జమ చేశారు. వీరే కాకుండా నియోజకవర్గంలోని అన్ని కులాలు కలిపి రూ.137,66,96,258లు నేరుగా, ఇతర రూపాల్లో నగదు బదిలీ ద్వారా ప్రభుత్వం అందజేసింది.

కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు



శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు పట్టణంలో నిర్వహిస్తున్న సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే పార్టీ నేతలు, కార్యకర్తలను కలిశాం. వారు ఉత్సాహంగా ఉన్నారు. తొలిసారిగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహిస్తున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

– రాజమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, ఆత్మకూరు

పార్టీ అభిమానులు వేలాదిగా తరలిరానున్నారు



ఆత్మకూరు పట్టణంలో నిర్వహిస్తున్న సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు వేలాదిగా తరలిరానున్నారు. ఇప్పటికే ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశాం. స్మృతి వనం వద్ద కార్యకర్తలకు అన్ని వసతులు కల్పించాం. అక్కడి నుంచే యాత్ర ప్రారంభమవుతుంది.

– సయ్యద్‌మీర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, ఆత్మకూరు

బస్సుయాత్రను విజయవంతం చేయండి



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి స్వాగతం పలుకుతున్న అంజూమన్ కమిటీ సభ్యులు

ఆత్మకూరు: పట్టణంలో ఈ నెల 24న నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని అంజూమన్ కమిటీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం కల్పించారన్నారు. ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాజకీయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, మహిళలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, అంజుమన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మకానికి ఎస్పీఎఫ్ బ్యారక్?

- విచారణ చేపట్టిన అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రాజెక్ట్ కాలనీలో జలవనరుల శాఖకు చెందిన బ్యారక్‌ను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు కేటాయించారు. దీంతో ఎన్నో ఏళ్లుగా వారు అక్కడే ఉండేవారు. అయితే వారికి వేర్వేరు గృహాలు కేటాయించడంతో కొద్దికాలంగా ఆ బ్యారక్ ఖాళీగానే ఉంది. దీనిపై కన్నేసిన జలవనరుల శాఖకు చెందిన ఓ ఉద్యోగి, కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఈ బ్యారక్‌ను పూర్తిగా ఆక్రమించారు. ఈ మధ్య కాలంలో వారి ప్రోద్బలంతో బ్యారక్‌కు ఉన్న రేకులను పూర్తిగా ప్రైవేట్‌వ్యక్తులు తొలగించడం, బ్యారక్‌ను అమ్మేందుకు బేరం పెట్టారని ఫిర్యాదులు అందడంతో బుధవారం మధ్యాహ్నం తహసీల్దార్ రాజేంద్ర సింగ్, పంచాయతీ కార్యదర్శి బాలు నాయక్, టూ టౌన్ ఎస్ఐ గంగయ్య యాదవ్ అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ బ్యారక్‌ను అమ్మకానికి ప్రైవేట్ వ్యక్తులు పెట్టినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకి వచ్చారు. దీంతో జీఓ నంబర్ 40ని అనుసరించి పూర్తిగా పంచాయతీ రాజ్ శాఖకు చెందినదని అధికారులు ప్రకటించారు. అక్కడ 'ఇది ప్రభుత్వ స్థలం' అని బోర్డు పెట్టాల్సిందిగా తహసీల్దార్ రాజేంద్ర సింగ్ పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఈ విషయం పై సమగ్ర రిపోర్ట్‌ను జిల్లా కలెక్టర్ కు అందజేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.



ఎస్పీఎఫ్ బ్యారక్ వద్ద విచారణ చేస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

గాయపడిన వీఆర్వోకు ఆర్థిక సాయం

నంద్యాలటౌన్: ఆళ్లగడ్డలోని 8వ సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్న ఆదిలక్ష్మి గత శుక్రవారం ఆళ్లగడ్డ మండలంలోని పేరాయపల్లె మెట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వీఆర్ఓను బుధవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య, నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పరామర్శించారు. గాయపడిన వీఆర్ఓకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఆస్పత్రి సిబ్బందికి కలెక్టర్ సూచించారు. అనంతరం రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ తరఫున రూ.3 లక్షలు, జిల్లా కలెక్టర్ తరపున రూ. 2 లక్షల చెక్కును అందజేశారు.



ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న కలెక్టర్, జేసీ

ఆలయంలో ప్రత్యేక పూజలు

మిడుతూరు : మండల కేంద్రంలో ఈనెల 24న నిర్వహించనున్న విగ్రహాల ప్రతిష్ఠలో భాగంగా బుధవారం ఆలయంలో గోపూజ, గణపతి, దేవతా, వాస్తు, నవగ్రహ పూజా కార్యక్రమాలను అర్చకులు బాలక్రిష్ణశర్మ ఆధ్వర్యంలో జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో బన్నూరు రామకృష్ణారెడ్డి, బింగి రామమోహన్, జింకల చంద్రుడు, బన్నూరు జగదీశ్వరరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడికి గాయాలు

నందికొట్కూరు రూరల్ : ట్రాక్టర్ ఢీకొని యువకుడు తీవ్ర గాయాలపాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన రహీంబాషా (26) సోమవారం రాత్రి కోళ్లబావాపురం గ్రామం నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా వడ్డెమాను గ్రామ సమీపంలోని మలుపు వద్ద ట్రాక్టర్ ఢీకొంది. దీంతో అతను తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని మెరుగైన వైద్య చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' వాయిదా

ఆత్మకూరు: పట్టణంలో గురువారం నిర్వహించాల్సిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం వాయిదా వేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి., మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈ నెల 24న సాధికార బస్సు యాత్ర కార్యక్రమం ఉన్నందున ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశామన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తరువాత ప్రకటిస్తామన్నారు. బస్సుయాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ప్రముఖులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను బుధవారం కర్ణాటక రాష్ట్ర పావగడ ఎమ్మెల్యే హెచ్ వి.వెంకటేష్, మధ్యప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్‌హెల్త్ అండ్ ఇంజినీరింగ్ మినిస్టర్ రాజేంద్రశుక్లా దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయమర్యాదలతో ఆహ్వానం పలికారు. వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.



మధ్యప్రదేశ్ మంత్రికి ఆహ్వానం పలుకుతున్న ఆలయాధికారులు

సమస్యల పరిష్కారంలో శ్రద్ధ చూపాలి

జూపాడుబంగ్లా: పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను పరిష్కరించడంలో ఎస్ఐలు శ్రద్ధ చూపాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. బుధవారం ఆయన జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి ఎస్ఐ మారుతిశంకర్‌కు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించడంతో పాటు వారి సమస్యలను సావధానంగా ఆలకించి, ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. వారికి న్యాయం జరిగేలా చేయాలని సూచించారు.



ఎస్ఐ మారుతిశంకర్‌కు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ప్రతి పని ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలి



విచారణ చేస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

పాములపాడు: జాతీయ గ్రామీణ ఉపాధీ హామీ పథకంలో భాగంగా చేపట్టే ప్రతి పని ప్రజలకు ఉపయోగంగా ఉండాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2021–22 ఫైనాన్స్ ఇయర్‌కు సంబంధించి మండలంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వరకు 615 పనులకు గాను రూ.8,49,23,574 ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ పనులపై తనిఖీ నిర్వహించారన్నారు. ఇందులో రికవరీ రూ.33,251, పెనాల్టీ రూ.14,864, రెక్టిఫికేషన్ రూ.5641, రీ ప్లాంటేషన్ రూ.1,66,812, డ్రాఫ్ట్ రూ.3,19,534గా తేల్చినట్లు వివరించారు. సమావేశంలో ఏపీడీ అన్వరాబేగం, ఏవీఓ బాలోజీ నాయక్, జేక్యూసీఓ గంగాధర్, ఎస్ఆర్‌పీ కన్నారెడ్డి, ఏపీఓ విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కులగణన పకడ్బందీగా చేపట్టండి

జూపాడుబంగ్లా: కులగణనను పకడ్బందీగా చేపట్టాలని ఏఎస్ఓ హనుమంతు, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో తాటిపాడు, తరిగోపుల, 80బన్నూరు, పారుమంచాల, తూడిచెర్ల సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు కులగణన సర్వేపై అవగాహన కల్పించారు. కులగణన వివరాలు ఎక్కడా బహిర్గతం చేయరాదని సూచించారు.

నందికొట్కూరు రూరల్ : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శోభారాణి అధ్యక్షతన మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లకు కులగణన సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈవోఆర్డీ సంజన్న, పంచాయతీ కార్యదర్శులు రవీంద్ర, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక మృతి

మహానంది: రోడ్డుప్రమాదంలో గాయపడిన బుక్కాపురం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు కోలుకోలేక మృతి చెందాడు. అతని అంత్యక్రియలకు గ్రామానికి చెందిన మారెడ్డి రామయ్య రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు ఆయన బుధవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులకు నగదు అందజేశారు. యువకులు పెద్దమురళీ, చందు, శ్రీను, ఉసేని ఉన్నారు.

పక్కాగృహాలు మంజూరు చేయాలి

ఆత్మకూరు: పట్టణంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, రామ్‌నాయక్ కోరారు. సుదర్శన వర్మ భవనంలో బుధవారం కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీలో పేదలకు చాలా మందికి ఇళ్లస్థలాలు మంజూరు కాలేదని, ఎస్‌హెచ్ రహదారిలో కూడా కొంద మందికి స్థలాలు కోల్పోవడం జరిగిందన్నారు.

సంక్షేమానికి కేరాఫ్ జగనన్న

- పేదల బతుకులు బాగుపడేలా పాలన
- ఉత్సాహంగా ఏపీకి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం



ఇంటింటికీ సంక్షేమ కరపత్రాలను అందజేస్తున్న నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి



వెలుగోడులో జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

నందికొట్కూరు: పేదల సంక్షేమ పథకాలకు కేరాఫ్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నిలిచిందని చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 11వ సచివాలయం పరిధిలో 6, 9, 11వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. 13వ సచివాలయ పరిధిలో లబ్ధిదారులకు డీబీటీ–నాన్ డీబీటీ కింద రూ.20,72,65,831, అభివృద్ధి పనులకు రూ.11,06,45,618 (మొత్తం రూ.31,79,11,449) కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వం అందించిన లబ్ధి వివరాల బోర్డును సచివాలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ రహత్, మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు చింత లక్ష్మిదేవి, విజయమ్మ, సుమలత, రఫూఫ్, లాలు, చాంద్ బాషా, హామీద్, జేసీఎస్ కన్వీనర్ అబుబక్కర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు సత్యనారాయణ, రజినీకుమార్‌రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పని యోధుడు వైఎస్ జగన్

వెలుగోడు: మాట తప్పని..మడమ తిప్పని యోధుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి కొనియాడారు. వెలుగోడు పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జన సందోహం, జగన్నినాదాల మధ్య పార్టీ జెండాను భువనేశ్వర్‌రెడ్డి ఎగురవేసి, నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం డీబీటీ ద్వారా అందించిన సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరించారు. సుపరిపాలన కొనసాగాలంటే సీఎం జగన్‌ను, శ్రీశైలం ఎమ్మెల్యేగా శిల్పా చక్రపాణిరెడ్డిని ఆశీర్వదించి మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, సర్పంచ్ వేల్పుల జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, షంషీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం

నందికొట్కూరు రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రవియాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొణిదేల–2 గ్రామ సచివాలయం పరిధిలో వైనీడ్ ఏపీ జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ ఓంకార్ రెడ్డి, ఎంపీటీసీలు చందమాల సురేష్, నాగేశ్వరరావు, సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

కొత్తపల్లి: పేదప్రజల సంక్షేమం కేవలం జగనన్నతోనే సాధ్యం అని జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శివపురం గ్రామంలో సర్పంచు ఎర్రం.చంద్రశేఖర్ యాదవ్, సూపరెండెంట్ సుబ్రమణ్యం అధ్యక్షతన పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రూ.17,61,06,834 ఖర్చుచేసిందన్నారు. కార్యక్రమంలో కో–ఆప్టేడ్ మెంబర్ మహమ్మద్‌గౌస్, ఎంపీటీసీ పెరుమాళ్ల శివన్న, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్‌బాషా, మాజీ సర్పంచు కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మిడుతూరు : రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌జగనన్నకే దక్కుతుందని మండల ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్‌రాహత్ అన్నారు. బుధవారం మండలంలోని మిడుతూరు గ్రామ సచివాలయం–2 పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వర రెడ్డి, పీర్‌సాహెబ్ పేట సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాగతులసీ రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ తువ్వా శివరామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదలు సుభిక్షం

పగిడ్యాల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయంశ– 2 పరిధిలోని నాయుడ్స్ కాలనీలో ఏపీకి జగనన్ననే ఎందుకు కావాలనే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల అధ్యక్షతన చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేంద్రయ్య, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, మాజీ ఎంపీటీసీ భాస్కర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బోయ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి సీఎంగా మళ్లీ జగనన్ననే గెలిపిద్దాం

ఆత్మకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని అర్బన్‌కాలనీ సచివాలయం– 2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, రాజగోపాల్, కౌన్సిలర్ రంగస్వామి, పార్వతి, బోయలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతకు మరోసారి పట్టం కడదాం

మహానంది: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం చిన్నదేవళాపురంలో బుధవారం పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో రూ. 16.82కోట్ల సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆవులపాటి మధుసూదన్ చౌదరి, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటమ్మ, జేసీఎస్ ఇన్‌చార్జ్ పుల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ శివలింగం, మార్కెట్ యార్డు డైరెక్టర్ విక్రమసింహానాయక్, మండల నాయకులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మరోసారి గెలిపించుకుందాం

మహానంది: ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజల మనస్సులో చెరగని ముద్ర వేసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి అన్నారు. సీతారామాపురం గ్రామంలో పల్లెకుపోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలో ప్రజలకు అందిన లబ్ధి, అభివృద్ధి పనులకు సంబంధించి రూ. 25.11కోట్ల సంక్షేమ డ్యాష్ బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు బుడ్డారెడ్డిగారి ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, బూత్ కమిటీల మండల కన్వీనర్ కుంచపు శ్రీనివాసులు, కందుల వెంకటసుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

జూపాడుబంగ్లా: పైసా ఖర్చులేకుండా ఇంటివద్దకే పథకాలిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను ప్రజలు మరోమారు సీఎంగా ఆశీర్వదించాలని జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా జాయింట్ సెక్రెటరీ తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని తర్తూరు గ్రామంలో సర్పంచ్ పీఎం నాగిరెడ్డి అధ్యక్షతన మానమ్మకం నువ్వేజగన్–పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ తర్తూరు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రూ.10,40,25,557లు, డీబీటీ మరియు నాన్ డీబీటీ కింద 2,71,63,513లు ప్రజల బ్యాంకుఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, సొసైటీ చైర్మన్ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లారెడ్డి, దినేష్, సురేష్, మహేశ్వరరెడ్డి, షాకీర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.